సాక్షి
కాకినాడ

గురువారం । 22 । ఆగస్టు । 2024



వైద్యులపై దౌర్జన్యకాండ

వైద్యులు దైవంతో సమానం అంటారు.. అలాంటి వారిపై కూటమి మద్దతుదారుల దాడులు అధికమయ్యాయి. ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం.


8లో



జన గళమే జానపదం..

జన గళమే జానపదం.. ఇది మన సంస్కృతికి ఆలవాలం.. నేటి రోజుల్లోనూ జానపదానికి గుర్తింపు పదిలం. పూర్వపు తూర్పుగోదావరి జిల్లా జానపద కళాకారులకు పెట్టింది పేరు.

సముద్రంలోకి 2.86 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి బుధవారం సాయంత్రం 2,86,532 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.60 అడుగులుగా ఉంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 14 వేల క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అన్నవరం దేవస్థానంలో బదిలీ యత్నాలు

అన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఐదేళ్లుగా అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులను బదిలీ చేసేందుకు అధికారులు నివేదిక సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గైడ్‌లైన్స్ ప్రకారం ఒకే చోట ఐదేళ్లకు పైబడి ఉద్యోగాలు చేస్తున్నవారిని బదిలీ చేయాలని పేర్కొనడంతో దేవస్థానంలో ఈ నలుగురి బదిలీ చేయాలని కమిషనర్‌కు రిపోర్టు పంపించారు. వీరిలో ఒక జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఏఈవో, సివిల్ ఏఈ ఉన్నారు. అయితే ఈ నలుగురు కూడా అనారోగ్య కారణాలతో తమ బదిలీ నిలుపుదల చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా గత నాలుగేళ్లుగా ఇతర దేవస్థానాల్లో పనిచేస్తున్న పలువురు అన్నవరం దేవస్థానం ఉద్యోగులు, తమ సొంత దేవస్థానానికి బదిలీ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. చాలామంది మ్యూచువల్ బదిలీలు కోరుకుంటున్నట్టు సమాచారం. ప్రధానంగా గతంలో రాయలసీమలో దేవస్థానాలకు బదిలీ అయిన సిబ్బంది తిరిగి అన్నవరం వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

హెడ్ పోస్టాఫీసులో డాక్ చౌపాల్



డాక్ చౌపాల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: కాకినాడ హెడ్ పోస్ట్ ఆఫీస్ ఆవరణలో బుధవారం డాక్ చౌపాల్ (పోస్ట్ ఆఫీసు పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం) అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ చుక్కా శ్రీనివాసరావు అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు, తపాలా సిబ్బంది పాల్గొని కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం నుంచి మసీదు సెంటర్ మీదుగా సినిమా రోడ్డు ప్రాంతాలను కలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పోస్టల్ అధికారులు గంటి రామకృష్ణ, అవరాల శ్రీనివాసరావు, డి అనిల్ అంబేద్కర్‌కుమార్, బోను జగదీష్, సూర్యప్రకాశరావు, డివిజన్ పోస్టల్ సిబ్బంది, పోస్ట్‌మన్లు పాల్గొన్నారు. కాకినాడ డివిజన్‌లో బుధవారం రూ. 7 లక్షల కొత్త ప్రీమియంలు సాధించినట్లు తెలిపారు.

అన్నవరంలో ఎమ్మెల్సీ బొత్స పూజలు



సత్యదేవుని తొలిపాంచా వద్ద పూజలు చేసిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

అన్నవరం: ఉత్తరాంధ్ర జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ బుధవారం రాత్రి అన్నవరంలో సత్యదేవుని తొలిపాంచా వద్ద పూజలు చేశారు. ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం విజయవాడ నుంచి విశాఖ వెళుతూ మార్గమధ్యలో ఆయన అన్నవరంలో ఆగి స్వామివారికి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు.

గ్రామసభలపై సూచనలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలు, ఈ నెల 23 నుంచి జరిగే గ్రామ సభలపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టర్ బంగ్లా నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలో ఉచిత ఇసుక ఈనెల 23వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్‌కు పలు సూచనలు జారీ చేశారు.

గులాబి గుబులు



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గులాబి రంగు పురుగు ఆశించిన పత్తిపంట

- రెడ్ జోన్‌లో తెల్ల బంగారం
- పత్తి పంటపై గులాబి రంగు పురుగు దాడి
- మళ్లీ విజృంభిస్తున్న కాయతొలుచు పురుగు
- జాగ్రత్తలు పాటించకపోతే నష్టమే అంటున్న అధికారులు

జిల్లాలో ఇలా..

పత్తిసాగు – సుమారు 11,850 ఎకరాలు

సాగు చేస్తున్న రైతులు – 8,890 మంది

ఏటా దిగుబడి – 2,13,300 క్వింటాళ్లు

పిఠాపురం: కొన్నేళ్ల క్రితం పత్తి రైతుల పాలిట శాపంగా ఉండే గులాబి రంగు పురుగు మళ్లీ దాడి చేస్తోంది. ఇటీవల వచ్చిన వరదల నుంచి తేరుకుంటున్న పత్తి పంటకు గులాబి పురుగు గుబులు పట్టుకుంది. 2014 నుంచి గులాబి పురుగు పంటకు తీవ్ర నష్టం చేకూర్చుతున్నా ఇప్పటి వరకు అది సోకకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ఏడాది సాగులో ఇది బయటపడింది. తాజాగా ఈ పురుగును గుర్తించిన వ్యవసాయశాఖాధికారులు పత్తి పంటకు ప్రమాదం పొంచి ఉన్నట్టు తేల్చి చెప్పేస్తున్నారు. ఈ పురుగు సోకితే 100 శాతం పంట నాశనమవ్వడం ఖాయమని, దీనిని నివారించాలంటే పంటలు ఉన్నచోట జాగ్రత్తలు పాటించడం, వచ్చే ఏడాది పంటమార్పిడే శరణ్యమని అధికారులు విస్పష్టంగా చెబుతున్నారు. దీంతో జిల్లాలో పత్తికు ప్రమాదం పొంచి ఉంది. దీంతో పత్తి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనదేశంలో లాంగ్‌పుల్ కాటన్, మీడియం స్టేపుల్ కాటన్, పొట్టి స్టేపుల్ కాటన్ అనే మూడు రకాలు పండిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం ఈ పురుగును అరికట్టే అవకాశం ఉంది. ఇప్పటి నుంచి జాగ్రత్తలు పాటించడం వల్ల కొంతవరకు నివారించుకోవచ్చు. ప్రస్తుత సీజన్‌లో తొలి దశలో సోకడం వల్ల కొంత వరకు నష్టం తగ్గినా మళ్లీ సాగు చేస్తే ఒక్కపైసా కూడా రాబడి రాదు. అందుకే ఈ విషయంపై రైతులకు ఏరువాక శాస్త్రవేత్తల ద్వారా అవగాహన సదస్సుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రస్తుతం ఈ పురుగు సోకిన పంటకు వ్యవసాయ శాఖ సూచనల ప్రకారం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. మరీ ఎక్కువగా ఈ పురుగు సోకిన పంటను వెంటనే తగులబెట్టాలి తప్ప ఇళ్ల వద్దకు, మిల్లులకు చేర్చరాదు. ఈ పంట ద్వారా వచ్చిన విత్తనాలను అసలు వాడకూడదు. అలా చేస్తే పురుగును పూర్తిగా నాశనం చేయడం కష్టంగా మారుతుంది. అందుకే ఈ పంట వేసిన రైతులు అత్యంత జాగ్రత్తగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ ద్వారా ఇప్పటికే రైతులకు పలు సూచనలు సలహా ఇచ్చాం.

– స్వాతి, ఏడీఏ, వ్యవసాయశాఖ, పిఠాపురం

భారీ నష్టమే

ఈ పురుగు సోకిందన్న విషయం కూడా తెలియకుండా కాయలో దాగి ఉండి వందల సంఖ్యలో గుడ్లు పెట్టి సంతతిని పెంచడం ద్వారా కాయను పూర్తిగా నాశనం చేస్తుంది. తద్వారా పత్తి కాయదశలోనే నాశనమయ్యి పంటపూర్తిగా దెబ్బతింటుంది. కాయలు లోపల పూర్తిగా దెబ్బతిని పగిలిపోతాయి. పత్తి తయారయ్యే సమయంలోనే ఇది ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది.

తాజాగా గుర్తింపు

జిల్లాలో గొల్లప్రోలు, జగ్గంపేట, రంగంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం తదితర మండలాలలో సుమారు 11,850 ఎకరాల్లో పత్తిపంట సాగవుతోంది. పత్తిపంటకు కాయతొలుచు పురుగు సోకడం దాని నివారణకు మందులు పిచికారీ చేయడం జరిగేది. కొన్నేళ్ల క్రితం వరకు గులాబి రంగు కాయతొలుచు పురుగు (పింక్‌బాల్ వార్మ్) పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగించేది. వివిధ రకాల మందులు పిచికారీ చేయడం ద్వారా పూర్తిగా నివారించగలిగారు. అప్పటి నుంచి దాని ప్రభావం తగ్గి రైతులకు పంట ఆశాజనకంగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లాలో గొల్లప్రోలు మండలంలో పత్తి పంట పరిశీలనకు వెళ్లిన వ్యవసాయశాఖాధికారులకు గులాబిరంగు పురుగు ఆశించడం కనిపించడంతో షాక్‌కు గురయ్యారు. అప్పటికే పంటంతా పురుగు ఆశించి నాశనమయ్యే పరిస్థితులు నెలకొనడంతో అన్ని ప్రాంతాల్లోను ఇది ఆశించి ఉంటుందన్న కోణంలో పరిశీలనలు జరిపిన అధికారులు తేలికపాటి నేలల్లో ఇది ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.



పురుగు సోకిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



పత్తి పువ్వులో అధికారులు గుర్తించిన గులాబి పురుగు

నివారించాలంటే..

ఈ పురుగును నివారించాలంటే ప్రస్తుతం తొలి దశలో ఉంది కాబట్టి తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పంట పూర్తిగా దెబ్బ తింటే పంటవిరామం తప్పనిసరిగా పాటించాలి. పంటను తీసేసిన అనంతరం పశువులతో మేయించి కాండం సైతం పూర్తిగా తొలగించి వేరే పంటను వేయడం ద్వారా దానిని పూర్తిగా నివారించవచ్చు. అలా సుమారు రెండు మూడు దఫాలు పంటమార్పిడి తప్పక చేపట్టాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు. గులాబి రంగు కాయ తొలుచు పురుగు నివారణకు ఎకరానికి ప్రొఫెనోఫాస్ : 400 మి. లీ లేదా క్లోర్ పైరిఫాస్ : 500 మి. లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని, రసం పీల్చే పురుగులు నివారణకు ఫ్లోనికామిడ్ -0.6 గ్రాములు లేదా థయామిథోక్సం – 0.2 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు.. లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణం పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

పంట అంతా వ్యాపించింది

నేను ఒక ఎకరంలో పత్తి సాగు చేశాను. విత్తనాలు వేసే నాటి నుంచి చాలా జాగ్రత్తలు పాటించాం. అయినప్పటికి పురుగు పంట అంతా వ్యాపించింది. అధికారుల సూచనల మేరకు ప్రస్తుతం నివారణా చర్యలు చేపట్టాం. కాని ఎంతవరకు పురుగు నాశనమవుతుందో తెలియని పరిస్థితి. గత అనుభవాలను బట్టి ఈ పురుగు సోకితే వంద శాతం నష్టమే తప్ప పెట్టుబడి కూడా రాదు. అయినప్పటికీ పురుగు నివారణకు ప్రయత్నాలు చేస్తున్నాం.

– బావిశెట్టి సూర్యప్రకాశరావు, పత్తి రైతు, తాటిపర్తి, గొల్లప్రోలు మండలం

30న రత్నగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అన్నవరం దేవస్థానం

అన్నవరం: అన్నవరం శ్రీ వీరవెంకటసత్యనారాయణస్వామి దేవస్థానంలో శ్రావణమాసంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఈ నెల 30వ తేదీ, చివరి శ్రావణ శుక్రవారం నిర్వహించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు రత్నగిరిపై స్వామివారి సత్య కల్యాణ మంటపంలో ఈ వ్రతాలు నిర్వహిస్తారు. తరువాత ఉదయం 10 గంటలకు మరో బ్యాచ్‌లో కూడా వ్రతాలు నిర్వహించుకునేందుకు మహిళలను అనుమతిస్తారు. ఈ వ్రతంలో పాల్గొనే మహిళలు అరటిపండ్లు, కొబ్బరికాయ, పువ్వులు తెచ్చుకోవాలి. వ్రతానికి అవసరమయ్యే పూజా ద్రవ్యాలు దేవస్థానమే సమకూర్చనుంది. వరలక్ష్మి రూపు, జాకెట్, మట్టిగాజులు, స్వామివారి ప్రసాదం మహిళలకు అందజేస్తారు. వ్రతం అనంతరం మహిళలకు ప్రత్యేక దర్శనం, అన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొనాలని కోరారు.

జీపీటీలో ఉచిత ఉపాధి శిక్షణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కాకినాడ గార్ల్స్ పాలిటెక్నిక్ (జీపీటీ) కళాశాలలో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాసంస్థ అధికారి డి.హరిశేషు బుధవారం తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నామని, 10వతరగతి ఉత్తీర్ణులై 18నుంచి 40 సంవత్సరాల వయస్సు లోపుగల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9010737998 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

బంద్ సంపూర్ణం



బంద్ సందర్భంగా డిపోలోనే నిలిచిపోయిన బస్సులు

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్‌బంద్ కాకినాడ జిల్లాలో ప్రశాంతంగా సంపూర్ణంగా బంద్ జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు కదలకుండా ఆందోళనకారులు ఆపేశారు. ఉదయం నుంచి ప్రభుత్వ ప్రైవేట్, పాఠశాలలు, కళాశాలలు పూర్తిగా బంద్ ప్రకటించాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలను దళిత సంఘాల నాయకులు మూయించి వేశారు. అదే విధంగా జిల్లాలోని పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, తాళ్లరేవు, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ తదితర ప్రాంతాల్లో ఆందోళనకారులు ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలను మూయించివేశారు. ఆటోలు, కార్లు యథావిధిగా తిరిగాయి.

నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

మండపేట: మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో స్మార్ట్ మెటీరియల్‌పై అంతర్జాతీయ సదస్సు ఉంటుందన్నారు. దీనికి జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. దక్షిణ కొరియా, న్యూయార్క్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఐఏఎస్ఎస్, ఐఐటీ, నీట్ ప్రతినిధులు వస్తారన్నారు. ఈ సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అధ్యాపకులు కె.శ్రీనివాసరావు, కె.కిరణ్‌కుమార్, ఎ.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను అరికట్టండి

ఎస్పీకి ముస్లిం సంఘ నేతల వినతి

కాకినాడ క్రైం: సోషల్ మీడియా వేదికగా ముస్లిం మతాచారాలపై ఉద్దేశపూర్వకంగానే కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ముస్లిం ప్రజా సంఘ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆ వర్గం నాయకులు బుధవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వినతి పత్రం సమర్పించారు. ముస్లింల ఉనికి ఇతర మతస్తుల ఉనికికి ప్రమాదకరమంటూ చేస్తున్న దారుణమైన ప్రచారాలు తీవ్రంగా కలచి వేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అమాయక ప్రజలు నమ్మి తమను శత్రువులుగా పరిగణించే అవకాశం ఉందన్నారు. వారి విన్నపానికి సానుకూలంగా స్పందించిన ఎస్పీ మత విద్వేషాలను రెచ్చగొట్టేవారిని ఉపేక్షించేది లేదన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఎవరు ఏ మతంపై విద్వేషకర వ్యాఖ్యలు చేసినా చట్టపరమైన చర్యలు చేపతామని హెచ్చరించారు. స్మార్ట్ సిటీ ముస్లిం వేదిక కన్వీనర్ హసన్ షరీఫ్, అధికార ప్రతినిధి అహ్మద్, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు అబ్దుల్ బషీరుద్దీన్ తదితరులు ఎస్పీని సత్కరించి ఖురాన్ గ్రంథాన్ని బహూకరించారు.



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వినతి పత్రం ఇస్తున్న ముస్లిం నాయకులు

కోతసీమ



మామిడికుదురు మండలం బి.దొడ్డవరంలో వైనతేయలో కలిసిపోతున్న కొబ్బరి చెట్లు

- ఒకవైపు గోదావరి, మరోవైపు సముద్రపు కోత
- కడలి.. నదీ గర్భాల్లో వందల ఎకరాలు
- తీరంలోకి చొచ్చుకు వస్తున్న కడలి
- ఆరు మండలాల్లో సముద్రంతో నష్టం

సాక్షి, అమలాపురం: ఒకవైపు గోదావరి గాయం చేస్తోంది. మరోవైపు కడలి కన్నెర్ర చేస్తోంది. గోదావరి వరదల ఉధృతికి వందలాది ఎకరాలు నదీ గర్భంలో కలిసిపోతుంటే.. మరోవైపు అలలు చొచ్చుకువచ్చి తీరంలో భూమిని కడలి కలిపేసుకుంటుంది. ప్రకృతి కన్నెర్రజేస్తుడడం పచ్చని కోనసీమ గుండెకు కోత పెడుతోంది.

గోదావరి వరదల ఉధృతికి విలువైన సాగు భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. జిల్లాలోని 17 మండలాల్లో 93 లంక గ్రామాలు ఉండగా, సుమారు 25 గ్రామాల్లో నదీకోత తీవ్రంగా ఉంది. మిగిలిన గ్రామాల్లో సైతం నదీ కోతకు భూములు కొట్టుకుపోతున్నాయి. లంక భూములు అంటే బంగారం పండే భూములని రైతులు గర్వంగా చెప్పుకొంటారు. ఇక్కడ కొబ్బరితోపాటు కోకో, అరటి, కంద, పసుపు, అల్లం, కూరగాయ పంటలతోపాటు పువ్వులు, నర్సరీలు, మొక్కజొన్న, అపరాల వంటివి సాగవుతుంటాయి. ప్రధానంగా ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట, అయినవిల్లి, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, అల్లవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం మండలాల్లో నదీ కోత అధికంగా ఉంది. గోదావరి మధ్య ఉన్న లంక గ్రామాల్లోనే కాకుండా ఏటిగట్లు, నదీ గర్భానికి మధ్య ఉన్న భూములు సైతం పెద్ద ఎత్తున కోతకు గురవుతున్నాయి. దశాబ్ద కాలంలో సుమారు 2 వేల ఎకరాలు కొట్టుకుపోయిందని అంచనా.

తీరంలో తీవ్రతరం

జిల్లాలో 95 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. అంతర్వేది నుంచి బలుసుతిప్ప వరకూ తీరం కోతకు గురవుతోంది. పలుచోట్ల సముద్ర కెరటాలు చొచ్చుకు రావడంతో వందల ఎకరాల సరుగుడు తోటలు సముద్రంలో కలిసిపోతున్నాయి. వీటిలో ప్రభుత్వంతోపాటు, రైతుల భూములు ఉన్నాయి. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం, మలికిపురం మండలం కేశనపల్లి, అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, కాట్రేనికోన మండలం నీళ్లరేవు, చిర్రయానాంలో తీరం కోత బారిన పడుతోంది.

పోటెత్తుతున్న నీరు



పోటు, పాటు సమయాలతో పాటు తుపాను వచ్చినప్పుడు రివెట్‌మెంట్ లేని ప్రాంతాల నుంచి ఇళ్ల వద్దకు సముద్రపు నీరు, వశిష్ఠ నది నీరు పోటెత్తుతోంది. గోదావరిలో పల్లిపాలెంలో గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివెట్‌మెంట్ రాళ్లు చెల్లాచెదురై దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి ముంపు సమస్య లేకుండా చూడాలి.

–కొల్లాటి నరసింహస్వామి, పల్లిపాలెం, సఖినేటిపల్లి మండలం

అరెకరం పోయింది



బి.దొడ్డవరంలో నాకు కొబ్బరి తోట ఉంది. ఏటా వచ్చే వరదలకు ఇప్పటి వరకూ 50 సెంట్ల (అర ఎకరం) కొబ్బరి తోట నదిలో కలిసిపోయింది. ఇలాగే నదీ కోత కొనసాగితే ఉన్న భూమి కూడా నదిలోకి వెళ్లిపోతోంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– పాటోలు సత్యనారాయణ, బి.దొడ్డవరం, మామిడికుదురు మండలం

చెప్పుకొంటే కారణాలెన్నో..

- గోదావరి మధ్య వరదల సమయంలో లంకలు ఏర్పడడం, తరువాత కోతకు గురికావడం సర్వసాధారణం. కానీ జనావాసాలు పెరగడం, విలువైన పంటలు పండుతుండడంతో నదీ కోత స్థానికులకు, రైతులకు నష్టాలను మిగుల్చుతోంది. గ్రోయిన్లు, రివెట్‌మెంట్లను ఎక్కడపడితే అక్కడ నిర్మించలే రు. సహజ ప్రవాహానికి ఇబ్బంది లేకుండా.. లంకల్లో నిర్మాణాలతో ఏటిగట్లకు ప్రమాదం వాటిల్లకుండా వీటిని నిర్మించాల్సి ఉంది.
- గోదావరి నది, సముద్రంలో కాలుష్యం పెరగడంతో బంగాళాఖాతంలో ఉష్ణోగ్రత పెరిగి తుపాన్లు ఎక్కువగా వస్తున్నారు. ఫలితంగా అలలు ఎగసిపడి సముద్ర తీరాన్ని కోసేస్తున్నాయి.
- మడ అడవులు జిల్లాలో సుమారు 8 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. అక్రమార్కుల కారణంగా ఇవి 5 చదరపు కిలోమీటర్లకు కుదించుకుపోయాయి. తీరంపై కెరటాలు విరుచుకుపడినా... సముద్రం చొచ్చుకువచ్చినా ఇవి 'స్ప్రింగ్‌లు'లా అడ్డుకుని వెనక్కి గెంటేస్తాయి. సునామీలను సైతం అడ్డుకుంటాయి. ఆక్వా సాగు, కలప సేకరణకు అడ్డగోలుగా వీటిని నరికివేస్తున్నారు. దీనివల్ల కూడా సముద్ర తీరం కోతకు గురవుతోంది.
- ఆక్వా సాగుతో తీరంలో కోస్టల్ ఆక్వా జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా చెరువుల తవ్వకం యథేచ్ఛగా సాగుతోంది. అలాగే ఇసుకను పెద్ద ఎత్తున తవ్వేస్తున్నారు. ఇవన్నీ సముద్ర ఉగ్రరూపానికి.. తీరం కోతకు కారణమవుతున్నాయి.

ఈ చిత్రం.. సజీవ సాక్ష్యం



ఓడలరేవులో 2005లో ఇసుల తిన్నెల మధ్య ఉండే ఓఎన్జీసీ వెల్స్ ఇప్పుడు సముద్రంలో ఇలా..



2018లో ఓఎన్జీసీ టెర్మినల్ భవనానికి, సముద్ర తీరానికి మధ్య సరుగుడు తోట



2022లో సముద్రం చొచ్చుకు వస్తుండడంతో కనుమరుగైన సరుగుడు తోట



2024లో ఓఎన్జీసీ టెర్మినల్ గోడకు రక్షణగా ఉన్న గ్రోయిన్లను సైతం ధ్వంసం చేసి ముందుకు వచ్చిన సముద్రం

ఈ చిత్రాలు జిల్లాలోని సముద్ర కోత తీవ్రతకు అద్దం పడుతున్నాయి. గడిచిన పదిహేన్నేళ్లలో సముద్ర కోత పెరిగిందనడానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. 2005లో అల్లవరం మండలం ఓడలరేవులోని సముద్ర తీరంలో సరుకుడు తోటలో ఉండే ఓఎన్జీసీ వెల్స్ ఇప్పుడు తీరానికి 60 అడుగుల దూరంలో సముద్రంలో ఉన్నాయి. తీరానికి 30 అడుగుల దూరంలో నిర్మించిన ఓఎన్జీసీ టెర్మినల్ గోడ ఇప్పుడు కెరటాల ఉధృతికి కొట్టుకుపోయే పరిస్థితి ఈ చిత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోంది.

క్లుప్తంగా

హుండీల ఆదాయం లెక్కింపు



మరిడమ్మ ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో హుండీల ద్వారా 29 రోజులకు సుమారు రూ.15.83 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. జాతర ఉత్సవాల ముగింపులో భాగంగా బుధవారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ తనిఖీ అధికారి చల్లా ఉదయ్‌బాబు నాయుడు, మహారాణి సత్రం ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్‌ల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ లెక్కింపు చేపట్టామన్నారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నిడదవోలు రూరల్: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిడదవోలు మండలం కాటకోటేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు దాసరి నాగమణిరాజును సస్పెండ్ చేస్తూ డీఈఓ వాసుదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖాధికారుల ఆదేశాలతో పాఠశాల హెచ్‌ఎం ఐ.లలితరమణి ఇచ్చిన ఫిర్యాదుపై నాగమణిరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ బుధవారం తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం కోరుపల్లికి చెందిన దాసరి నాగమణిరాజు గతంలో ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న సమయంలో ఒక విద్యార్థినిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం పొందిన నాగమణిరాజుకు తన భార్య మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో తన భర్త నాగమణిరాజు తనతో పాటు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అధికారులు ఇటీవల పాఠశాలలో విచారణ చేపట్టి నివేదిక అందజేశారు. కలెక్టర్, డీఈఓ ఇచ్చిన ఆదేశాలతో నాగమణిరాజును సస్పెండ్ చేయడంతో పాటు పోక్సో కేసు నమోదు చేశారు.

వైద్యులపై దౌర్జన్యకాండ

- కూటమి మద్దతుదారుల వేధింపులు
- ఇద్దరు వైద్యులు విధులకు దూరం
- ఆలమూరు సీహెచ్‌సీలో ఘటనలు
- ఉన్నతాధికారుల చర్యలు శూన్యం

ఆలమూరు: వైద్యులు దైవంతో సమానం అంటారు.. అలాంటి వారిపై కూటమి మద్దతుదారుల దాడులు అధికమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. ఇక్కడ ఇటీవల కాలంలోనే ముగ్గురు వైద్యులపై దౌర్జన్యకాండ జరిగింది. ఇప్పటికే గైనకాలజిస్ట్ విభాగ వైద్యురాలు ఉద్యోగానికి రాజీనామా చేయగా, మరో వైద్యురాలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. మరో వైద్యాధికారి మాత్రం అవమానాలు ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆలమూరులో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) ఉంది. గత ప్రభుత్వ హయాంలో రూ.ఆరు కోట్లతో అధునాతన వసతులతో సమాంతరంగా మరో ఆసుపత్రిని నిర్మించారు. రోజూ సుమారు 500 మంది రోగులు సేవలు పొందుతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆసుపత్రిలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆసుపత్రి వైద్య సిబ్బందిపై వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలతో తనదైన ప్రత్యేకత చాటుకున్న వైద్యురాలు ఎస్కే షమీ ఉన్నీసాను (ఎంఎస్) చంపేస్తానంటూ బెదిరించిన నిందితులను ఇప్పటికీ గుర్తించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఆగస్టు 16న సీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్‌లో ఆమె శస్త్రచికిత్స చేస్తుండగా, అనుమతి లేకుండా వచ్చిన ఒక వ్యక్తిని బయటకు వెళ్లాలని చెప్పిన కారణంగా అప్పటికే మద్యం తాగి ఉన్న ఆ వ్యక్తి వైద్యురాలిని నానా దుర్భాషలాడి చంపుతానని బెదిరించాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రిలో రక్షణ లేకుండా విధులు నిర్వహించలేమని ఆమె దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ఈ ఏడాది మే 29న సీహెచ్‌సీకి ప్రసవం కోసం వచ్చిన ఇటుక బట్టీలో పనిచేస్తున్న మహిళను గైనకాలజిస్ట్ మేఘ స్పందన పరీక్షించి ఆమె ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం సత్వరమే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని సిఫారసు చేశారు. అయితే ఆ ఇటుక బట్టీ యజమాని సీహెచ్‌సీకి వచ్చి పురుడు పోయకపోతే మీరెందుకంటూ ఆ వైద్యురాలిని తీవ్రంగా దుర్భాషలాడి దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆ వైద్యురాలు ఆత్మాభిమానాన్ని చంపుకోలేక, జరిగిన అవమానాన్ని తట్టుకోలేక మరుసటి రోజైన మే 30న తన వైద్య వృత్తికి రాజీనామా చేశారు. దీనిపై ఇప్పటికీ విచారణ చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ గైనకాలజిస్ట్‌ను నియమించక పోవడంతో గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. జూలై 31న ఓపీ విభాగం చూస్తున్న వైద్యుడు ఎం.మణిదీప్‌పై చికిత్స కోసం వచ్చిన ఓ వ్యక్తి వెంటనే వైద్యం చేయలేదంటూ దౌర్జన్యం చేశాడు. ఈ అవమానంతో కొన్నాళ్లు సెలవుపై వెళ్లిన ఆయన ఇటీవలే విధుల్లో చేరారు.



ఆలమూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం

ఆకతాయిలకు అడ్డాగా..

సీహెచ్‌సీ పరిసరాలు ఆకతాయిలకు అడ్డాగా మారిపోయాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీహెచ్‌సీ పక్కనే ఖాళీ ప్రదేశం ఉండటంతో అనేక మంది యువకులు అక్కడకు చేరి మాదక ద్రవ్యాల మత్తులో అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆసుపత్రిలోని వైద్యారోగ్య సిబ్బందికి మాత్రం ప్రయోజనం చేకూరలేదు. దీంతో రాత్రి అయ్యిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సిబ్బంది విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటనను తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

రక్షణ లేకుంటే బాధ్యతలు నిర్వర్తించలేం

ఆలమూరు సీహెచ్‌సీలో పూర్తిస్థాయి రక్షణ లేకుంటే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించలేమంటూ సూపరింటెండెంట్ గోపీరామ్ దృష్టికి ఆసుపత్రి సిబ్బంది తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. సీహెచ్‌సీలో సుమారు 54 మంది వరకూ పనిచేస్తుండగా అందులో ఐదుగురు వైద్యాధికారులు, 13 మంది స్టాఫ్ నర్సులతో పాటు లాబ్ టెక్నీషియన్లు, నాలుగో తరగతి సిబ్బంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వైద్యులపై తరచూ జరుగుతున్న దాడులపై బుధవారం బాధిత వైద్యులను వివరణ కోరే ప్రయత్నం చేయగా వారు స్పందించలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేస్తానన్నారని వైద్యురాలు ఉన్నీసా చెప్పారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా..

తమ సీహెచ్‌సీలో వైద్యురాలు ఉన్నీసాపై జరిగిన దాడిపై సూపరింటెండెంట్ పి.గోపీరామ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో, 20న జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధిత వైద్యురాలు తమ సహ వైద్యులతో కలసి ఫిర్యాదు అందించారు. జిల్లా వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఫలితం లేకపోయింది. నిందితులు కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులు కావడం వల్లే వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన జరిగిన రెండు రోజులకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి వివరాలను నమోదు చేసుకుని వెళ్లిపోయారని తెలుస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నకిలీ అధికారి తనిఖీలు

- ఫుడ్ చెకింగ్ అధికారినంటూ బెదిరింపులు
- అనంతరం సిబ్బందితో సెల్ఫీలు



చాగల్లులోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో సెల్ఫీ దిగిన నకిలీ అధికారి

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్ చెకింగ్ నిమిత్తం తనను జిల్లా కలెక్టర్ పంపారంటూ ఓ వ్యక్తి బురిడీ కొట్టించే ప్రయత్నం చేశాడు. ఇలా ఈ నెల 1న చాగల్లులోని ఆరు కేంద్రాలు, తాళ్లపూడిలో ఒకటి, ఐ.పంగిడిలో ఆరు కేంద్రాలను తనిఖీ చేశాడు. 8న అరికిరేవుల గ్రామానికి వచ్చి మూడు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశాడు. ఈ కేంద్రంలో వంట సామగ్రి, సరకులు చూసి సిబ్బందిని దూషించాడు. మీ పనితీరు బాగోలేదని అంటూ బెదిరించాడు. అనంతరం సెల్ఫీలు తీసుకున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై జిల్లా ప్రాజెక్టు అధికారి విజయకుమారికి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలసి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ వ్యవహారంపై అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఈ నెల 12న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తాను ఎవరినీ పంపలేదని బదులిచ్చారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రాజెక్టు అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పీడీ సూచనల మేరకు ఈ నెల 14న చాగల్లు, కొవ్వూరు పట్టణ, కొవ్వూరు రూరల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. బుధవారం కొవ్వూరు సీడీపీఓ డి.మమ్మి కొవ్వూరు పట్టణ పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ముగ్గురికి గాయాలు
- తక్షణ వైద్య సేవలకు కలెక్టర్ ఆదేశాలు

రాజానగరం: జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం రాజానగరంలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లో వెళ్తే.. పెద్దాపురం మండలం, కొత్తూరుకు చెందిన సీహెచ్ మసిరమ్మ తన కొడుకు, కుమార్తె సీహెచ్ దుర్గాప్రసాద్, జి.వీరవెంకటలక్ష్మిలతో కలసి బైకుపై వెళ్తుండగా రాజానగరంలో జాతీయ రహదారి, ఏడీబీ రోడ్డు జంక్షన్‌లో ప్రమాదానికి గురయ్యారు. పై జంక్షన్ దాటే సమయంలో వారు ప్రయాణిస్తున్న బైక్‌ను రాజమహేంద్రవరం వైపు నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆ ముగ్గురూ బైక్ పైనుంచి ఎగిరి దూరంగా పడ్డారు. క్షేత్ర సందర్శనలో భాగంగా అటుగా వచ్చిన కలెక్టర్ పి.ప్రశాంతి ఆ ప్రమాదాన్ని చూసి వెంటనే అవసరమైన చర్యలు తీసుకున్నారు. లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఆ ముగ్గురిని 108 అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో వేరే వాహనంలో జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఫోన్‌లో ఆసుపత్రి వర్గాలతో మాట్లాడి, తక్షణమే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదాన్ని చూసి సహాయక చర్యలపై ఆదేశాలు ఇస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రియాక్టర్ ప్రమాదంలో కాకినాడ యువతి మృతి

నగరంలో విషాదఛాయలు

కాకినాడ రూరల్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టరు పేలుడు ప్రమాదంలో కాకినాడ 2వ డివిజన్ సౌజన్యనగర్‌కు చెందిన చర్లపల్లి హారిక (22) మృతి చెందడంతో నగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హారిక బీటెక్ పూర్తి చేసి గతేడాది సెప్టెంబర్ నెలలో ట్రైనీ ఇంజినీర్‌గా ఫార్మా కంపెనీలో విధుల్లో చేరారు. ల్యాబ్‌లో పని చేస్తున్న ఆమె రియాక్టర్ పేలుడు ప్రమాదంలో చిక్కుకుని మృతి చెందారు. హారిక తండ్రి తాపీమేస్త్రిగా పనిచేస్తూ చనిపోయారు. సోదరుడు పదేళ్ల వయసులోనే ఇంటి నుంచి తప్పిపోయాడు. తల్లి అన్నపూర్ణ, నాన్నమ్మ ఆదిలక్ష్మితో ఆమె కలిసి ఉంటోంది. కాకినాడ రమణయ్యపేట 2వ డివిజన్ మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్న హారిక మెరిట్ స్టూడెంట్ కావడంతో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. అక్కడ ఇంజినీరింగ్ చదివింది. కెమికల్ ఇంజినీరుగా ఫార్మా కంపెనీలో ఎంపికవ్వడంతో గత సెప్టెంబరు నుంచి ట్రైనీగా పని చేస్తోంది.





కాకినాడ సౌజన్యనగర్‌లో హారిక నివాసం వద్ద విషాదపు ఛాయలు (అంతరచిత్రం) మృతిరాలు చర్లపల్లి హారిక (ఫైల్)

ఉదయమే ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

రెండు రోజుల పాటు సెలవుపై పరీక్షలు రాసేందుకు ఇంటికి వచ్చిన హారిక బుధవారం ఉదయం కాకినాడ నుంచి తిరిగి విధులకు వెళ్లింది. మధ్యాహ్నం విధుల్లో ఉండగా రియాక్టర్ పేలి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న తల్లి అన్నపూర్ణ, నాన్నమ్మ ఆదిలక్ష్మి ప్రమాద స్థలం వద్దకు వెళ్లారు. ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు సౌజన్య నగర్ చేరుకుని కన్నీరు మున్నీరు అవుతున్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయనగరం జిల్లాలో ఈ నెల 16 నుంచి 19 వరకూ జరిగిన ఏపీ సీనియర్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడకు చెందిన గనిశెట్టి భార్గవ్ శ్రీరామ్ పాల్గొని ప్రతిభ చాటాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. తొమ్మిదేళ్ల తరువాత భార్గవ్‌శ్రీరామ్ ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం గమనార్హం. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకూ రాజమహేంద్రవరంలో జరిగే సౌత్ జోన్ పోటీలు, త్వరలో బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.



పతకంతో భార్గవ్‌రామ్

మోడ్రన్ పెంటాథ్లాన్‌లో ప్రతిభ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీల్లో కాకినాడకు చెందిన సురవరపు రామ్మోహన్‌రావు పాల్గొని ప్రతిభ కనబరిచాడని మోడ్రన్ పెంటాథ్లాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. 40 ఏళ్ల విభాగంలో రామ్మోహన్‌రావు బంగారు పతకం కైవసం చేసుకున్నాడన్నారు. స్థానిక డీఎస్ఏలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో రామ్మోహన్ రావును డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ అభినందించారు. పీడీ రంగారావు, స్విమ్మింగ్ కోచ్ నాయుడు, రాయుడు మూర్తి, ఫణికుమారి, మోడ్రన్ పెంటాథ్లాన్ కోచ్ కట్ట జగన్మోహన్ పాల్గొన్నారు.



రామ్మోహన్‌రావును అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్

జన గళమే జానపదం..

- మన సంస్కృతికి ఆలవాలం
- ఉమ్మడి జిల్లాలో ఎందరో కళాకారులు
- వీటికి ప్రాణం పోస్తున్న సంస్థలు
- నేడు అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవం



అంగరలో గరగ నృత్యం చేస్తున్న కళాకారులు

కపిలేశ్వరపురం: జన గళమే జానపదం.. ఇది మన సంస్కృతికి ఆలవాలం.. నేటి రోజుల్లోనూ జానపదానికి గుర్తింపు పదిలం. పూర్వపు తూర్పుగోదావరి జిల్లా జానపద కళాకారులకు పెట్టింది పేరు. కోనసీమ, గోదావరి, మెట్ట ఇలా ప్రాంతాల రీత్యా కళల, కథకుల తీరు వేరు తప్ప సారాంశమంతా మానవ ప్రయోజనమే. గురువారం అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా జానపద కళల జాడలను స్పృశిద్దాం.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 55 వేల మంది జానపద కళాకారులు ఉన్నారు.

ఇక్కడి ప్రతి ప్రాంతంలో గరగ నృత్యం, డప్పు వాయిద్యం, కోలాటం తదితర కళాకారులు ఆయా కళలను పోషిస్తున్నారు. తప్పెటగుళ్ల కళాకారులకు పెద్దాపురం, కాకినాడ పెట్టింది పేరు. మాధవపట్నానికి చెందిన తోలుబొమ్మల కళాకారులకు విశేష గుర్తింపు ఉంది. పెద్దాపురం, తదితర మెట్ట ప్రాంతాల్లో సాముగారడి గుండె ధైర్యానికి ప్రతీకగా నిలుస్తోంది. జిల్లాలో 45 శాతం భూభాగమున్న ఏజెన్సీ ప్రాంతాల్లో థింసా నృత్యం ప్రత్యేకతను చాటుతోంది. జాతరలు, వారపు సంతలు, వివాహాది శుభ కార్యాల్లో ఇంటిళ్లపాదీ కోలాటం, రేలా నృత్యం లాంటి జానపద కళలను ప్రదర్శిస్తారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో 63 పంచాయతీల పరిధిలో 270 గ్రామాల్లో 83,237 మంది ప్రకృతి నియమాలకు కట్టుబడి జీవిస్తుండటంతో ఆ ప్రాంతంలో జానపద కళలు సజీవంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దళితులు గారడీ నృత్య కళను తమ భుజాలపై వేసుకుని పోషిస్తున్నారు. రామచంద్రపురం ప్రాంతంలో బుర్రకథ, కపిలేశ్వరపురం మండలంలో గంగిరెద్దుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, గరగ నృత్యం కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

జానపద నేపథ్యమిలా..

విశ్రాంతి సమయం, శ్రమ చేసేటప్పుడో జనం నోటి వెంట వచ్చిన పలుకులే జానపదాలు. రాజమహేంద్రవరానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు నేదునూరి గంగాధరం 1930లో సేకరించిన జానపద సాహిత్యంతో అక్కడి లక్ష్మీవారపుపేటలో జానపద వాఙ్మయ గ్రంథాలయాన్ని నెలకొల్పారు. తాను సేకరించిన 30 తాళపత్ర గ్రంథాలు, సాహిత్యం, 56 చిత్రపటాలు, స్వీయానుభవంతో తన రచనలను గ్రంథాలయంలో నిక్షిప్తం చేశారు. సినీనటి జమున, సి.నారాయణరెడ్డి, ఆత్రేయ తదితరులు గ్రంథాలయంలో సాహిత్య అధ్యయనం చేశారు.



డప్పు కళను ప్రదర్శిస్తున్న కళాకారులు



పల్లెసుద్దులు కళను ప్రదర్శిస్తున్న పెద్దాపురం కళాకారులు (ఫైల్)

కళ.. కృషి ఇలా..

- పెద్దాపురానికి చెందిన సాహితీ స్రవంతి అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు తెలుగు యూనివర్సిటీలో తాను పరిశోధన చేసిన హరిశ్చంద్ర నాటకాలు–తులనాత్మక పరిశీలన అంశాన్ని పుస్తకంగా రూపొందించి ఈ ఏడాది జూలై 21న ఆవిష్కరించారు.
- రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత పాఠశాలలో కూచిపూడి డిప్లొమా చేస్తున్న ముగ్గురు విద్యార్థినులు మలేషియాలో జూలై 7–14 మధ్య నృత్య ప్రదర్శన ఇచ్చి గుర్తింపు సాధించారు.
- రావులపాలెం సీఆర్‌సీ ఆధ్వర్యంలో 24వ ఉగాది నాటికల పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు నిర్వహించారు. వీటిని ఏప్రిల్ 9, 10, 11 తేదీల్లో ప్రదర్శించారు. సినీ నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వంశీ, నటుడు కోట శంకరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
- కాకినాడ సూర్య కళామందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జూలై 10 నుంచి 14 వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించారు.
- రాజమహేంద్రవరంలో నటరాజ నృత్య నికేతన్ స్థాపించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాట్యాచారుడు సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ 2న 125 మంది కళాకారులు 14 గంటల పాటు అతి పురాతన ఆలయ నృత్యాన్ని ప్రదర్శించారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేయూత

ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారు జామున ఆరు గంటలకే వలంటీర్ల ద్వారా ఇంటికెళ్లి ఈ కళాకారులకు పింఛను డబ్బులు అందజేసిన ఘనత గత వైఎస్ జగన్ ప్రభుత్వానికి దక్కుతుంది. రంగ స్థల సమాజాలు, పరిషత్‌లకు రూ.5 లక్షలతో వైఎస్సార్ రంగస్థల పురస్కారాలను ఇచ్చేందుకు కృషి చేసింది. కళాకారులకు గుర్తింపు కార్డులను ఇచ్చేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది.

64 కళల కలబోత ఇది..

పల్లె సుద్దులు, హరికథ, బుర్రకథ, వయోలిన్, మృదంగం, శిల్ప కళ, చేనేత కళ, గరగ నృత్యాలు, కర్రసాము, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, పులివేషం, కొర్ర గేదెలాట, కొమ్ము బూరల ప్రదర్శన, చెక్కభజన, గంగిరెద్దులాట, కోలాటం, గారడీలు, పిట్టల దొరలు, తప్పెటగుళ్లు, జముకుడి కథలు, వీర ముష్టుల శూల నృత్యం, దొమ్మరాట, తోలుబొమ్మలాట, బుడబుక్కలాట, కొమ్మదాసరి ఆట, ఒగ్గు కథ, జోడుగుమ్మలాట, కర్రసాము, కత్తిసాము, అగ్నిగుండ ప్రదర్శన, మల్లికాసుల ఆట వంటి 64 కళల కలబోతే జానపదం.

పింఛన్ల సొమ్ము పెంచాలని..

ప్రస్తుత ప్రభుత్వంలో భాషా సాంస్కృతిక శాఖ తమ బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కళాకారులు కోరుతున్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి కళాకారునికి వృద్ధాప్య పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని కోరుతూ కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం నాయకులు ఈ నెల 6న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



జానపద కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఆ కృషి లేకపోయినప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయ, ఆధునిక కళలకు అలవాటు పడతారు. ఆ ప్రమాదాన్ని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రోత్సాహకాలతో యువతను జానపద కళారంగం వైపు ఆకర్షించేలా కార్యాచరణ చేయాలి.

–దారపురెడ్డి కృష్ణ,
పల్లెసుద్దులు కళాకారుడు,
పెద్దాపురం